విశాలాంధ్ర కృష్ణా జిల్లా

గ్రూప్-1 పరీక్షలో బయోమెట్రిక్ విధానం లేదు : జేసీ

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఈ నెల 17న జరిగే గ్రూప్-1 ప్రాథమిక పరీక్షకు బయో మెట్రిక్ విధానం లేదని జాయింట్ కలెక్టర్, ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష జిల్లా కో-ఆర్డినేషన్ అధికారి గీతాంజలి శర్మ శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి కార్డ్, మొదలైనవి) తీసుకురావాలని, ఆయా గుర్తింపు కార్డును పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను అనుమతించనున్నట్లు ఆమె తెలిపారు.

పొలిటికల్ హోర్డింగ్, పోస్టర్లు తొలగింపు

విశాలాంధ్ర-కూచిపూడి : ఎన్నికల నియమావళి అమల్లోకి రాగానే శనివారం నుంచి మొవ్వ మండలం పలు గ్రామాలలో భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన హోర్డింగులు, రాజకీయ బ్యానర్లను తొలగింపు చర్యలలో నిమగ్నమైనారు. దీనిలో భాగంగానే పెదపూడి పంచాయతీ కార్యదర్శి ఏ డి వి ఎల్ ప్రసాద్ ఆదేశాలతో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎస్ ఎస్ ఆర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పెదపూడి లోని రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన భారీ బ్యానర్లను, పోస్టర్లను తొలగింపులు చేపట్టారు. అలాగే పలు పంచాయతీ కార్యాలయంలో, ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఫోటోలు తొలగింపు కూడా చర్యలు చేపట్టారు. అదేవిధంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇస్లావత్ భవాని (కూచిపూడి), ఎం ఎం ఎస్ మూర్తి (కోసూరు), ఏ డి వి ఎల్ ప్రసాద్ (కాజ), వక్కలగడ్డ నరసింహారావు (అయ్యంకి), దేగల ఝాన్సీ లక్ష్మి (భట్ల పెనుమర్రు), కళ్ళేపల్లి సోమేశ్వరరావు (మొవ్వ) లతోపాటు వారికి అదనంగా కేటాయించిన గ్రామాల పరిధిలో గల రాజకీయ బ్యానర్లను, తొలగింపు చర్యల్లో నిమగ్నమైనారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రాజకీయ నాయకుల విగ్రహాలకు సైతం ముసుగులు వేసే పనులు చేపట్టారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పంపిణీ చేశారు. శనివారం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ఎం.ఎల్.ఏ సింహాద్రి రమేష్ బాబు తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. మోపిదేవి మండలంలో ముగ్గురికి, కోడూరు మండలంలో ఒకరికి మొత్తం నలుగురికి రూ.98 వేల చెక్‌లను సింహాద్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, యువనాయకుడు వికాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు గరికిపాటి బుల్లి, రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి గాజుల జయగోపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే... ప్రగతికి సోపానం

విశాలాంధ్ర -పమిడిముక్కల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాల యాలు అంగన్వాడీలు రైతు భరోసా కేంద్రాలు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు కు కోట్లాది రూపాయల ఖర్చుచేస్తోందని దీనితో పల్లెల్లో అభివృద్ధి ని మన ముఖ్యమంత్రి జగనన్న పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శనివారం కపిలేశ్వరపురం లో అంగన్వాడీ భవనం ప్రారంభోత్సవం, సిమెంట్ రోడ్లు కు శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్ల ద్వారా అవ్వ,తాతలకు తెల్లవారకమునుపే పెన్షన్లు అందించిన ఘనత మన ముఖ్యమంత్రిదే నని, ఇంకా సంక్షేమ పథకాలు పొందాలంటే జగనన్న కే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.నాగమణి వైఎస్ యంపిపి కొడమంచిలి మహేష్ గంజాల సీతారామయ్య స్థానిక యంపిటిసి లు కె.అంక కుమారి యం.రాజేశ్వరి వైఎస్ సర్పంచ్ ప్రసాద్ వైసీపీ నాయకులు యేనుగ మస్తాన్ రావు కార్యకర్తలు అభిమానులు మహిళలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాడ్లు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : 10 వ తరగతి విద్యార్థులకు పాడ్‌లు, పెన్‌లు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు పంపిణీ చేశారు. ఈ నెల 18 వ తేది సోమవారం నుండి 10 వ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో విద్యను అభ్యసిస్తున్న 65 మంది విద్యార్థులకు అవనిగడ్డలోని శ్రీ సిద్దార్థ టుటోరియల్స్‌లో కోచింగ్ తీసుకుంటున్న 55 మంది విద్యార్థులకు శనివారం పరీక్ష పాడ్‌లు, స్టేషనరీ శ్యామ్ కిషోర్ నాయుడు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి సాల్మన్ రాజు, ఆ యా హాస్టల్స్ వార్డెన్లు, శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు నరసింహానాయుడు, మోపిదేవి కోటేశ్వరరావు, గూడవల్లి తిలక్, పసుపులేటి లాల్, సాయి ఫణీంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ వైసీపీ ఎన్నికల కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని మచిలీపట్నం పార్లమెంట్ వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌తో కలసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)లు ప్రారంభించారు. శనివారం స్థానిక ఏలూరురోడ్డులోని సింధూర దియేటర్ సమీపంలో వైసిపి ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషక ఆహారాల వినియోగంపై దృష్టి సారించండి

విశాలాంధ్ర-కూచిపూడి : ఇంటి వద్ద తోటలలో సాగు చేసే పోషకాహారాలు కలిగిన తినుబండారాలపై శ్రద్ధ పెంచుకోవాలని మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్. అబ్దుల్ సలీ మున్నీసా సూచించారు. ఆమె నిడుమోలు సెక్టార్ పరిధిలోని నిడుమోలు అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించి గర్భవతులకు, బాలింతలకు, కిషోర్ బాలికలకు, పిల్లలకు పలు సూచనలు ఇచ్చారు. పోషకాలు అధికంగా గల పండ్లను, వేరుశనగ పప్పు చిక్కీలను, కొలెస్ట్రాల్ పెరగని పప్పు పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగానే గృహ సందర్శన కార్యక్రమాన్ని కూడా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆయా కేంద్రాల కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మోగిన సార్వత్రిక ఎన్నికల నగారా!

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్, శాసనసభ ఎన్నికలకు సంబంధించి శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం తో తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దేశంలో సార్వత్రిక ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నాలుగో విడత ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఏప్రిల్ 18వ తేదీన పార్లమెంట్, శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఆయా ఎన్నికల అధికారులు నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. కృష్ణాజిల్లాలో ఒక పార్లమెంట్ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నాలుగో విడత ఎన్నికలు నిర్వహించనుండడంతో అధికార పార్టీ నాయకులు కొంత అసంతృప్తి గురైనప్పటికి, ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థులు మాత్రం ఊపిరి పీల్చుకున్నారు. తొలి విడత ఆంధ్రప్రదేశ్ లో సార్వత్రిక ఎన్నికల జరుగుతాయని అధికార పార్టీ నేతల భావించి ఆదిశగా అభ్యర్థులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మే 13 న పోలింగ్ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఏప్రిల్ 18న అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల స్వీకరణకు ఏప్రిల్ 25 చివరి తేదీగా నిర్ణయించారు. 26 ఏప్రిల్ న నామినేషన్ల స్క్రూటినీ జరగనుంది. అభ్యర్థుల ఉపసంహరణకు గడువు ఏప్రిల్ 29గా ప్రకటించింది. అనంతరం రంగంలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఏప్రిల్ 13న పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహించి గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారు. నేటి నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ కోడ్ వర్తించనుంది. రాజకీయ పార్టీలు, నేతలు ఎలక్షన్ కోడ్ ను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పార్లమెంట్ పరిధిని నూతన జిల్లాలుగా ఏర్పాటు చేశారు. మచిలీ పట్నం పార్లమెంటు పరిధిలో మొత్తం 15,18,255 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. వీరిలో పురుష ఓటర్లు 7,37,394 మంది, మహిళా ఓటర్లు 7,80,796 మంది, ఇతర ఓటర్లు 65 మంది ఉన్నారు. ఈ జాబితాలో పురుషులకన్నా మహిళా ఓటర్లే 43,402 మంది అధికంగా ఉన్నారు. శాసనసభ నియోజకవర్గాల్లో కూడా మహిళా ఓటర్లే పైచేయిగా నిలిచింది. జిల్లాలోని 7 నియోజక వర్గాలలో పెనుమలూరు నియోజకవర్గంలో అత్యధికంగా 2,86,679 ఓటర్లు ఉండగా, పెడన నియోజకవర్గంలో అత్యల్పంగా 1,65,770 మంది ఓటర్లు ఉన్నారు. గన్నవరం నియోజకవర్గంలో పురుషులు 1,33,839 మహిళలు 1,43,469 మొత్తం ఓటర్లు 2,77,323 మంది ఉన్నారు. గుడివాడ నియోజకవర్గంలో పురుషులు 96,342, మహిళలు 1,04,434, మొత్తం ఓటర్లు 2,00, 786 మంది ఉన్నారు. పెడన నియోజకవర్గంలో పురుషులు 82,245 మహిళలు 83,524 మొత్తం ఓటర్లు 1,65,770 మంది ఉన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో పురుషులు 93, 492, మహిళలు 1,00,079, మొత్తం ఓటర్లు 1,93, 574 మంది ఉన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో పురుషులు 1,04,121, మహిళలు 1,06,823, మొత్తం ఓటర్లు 2,10,965 మంది ఉన్నారు. పామర్రు నియోజకవర్గంలో పురుషులు 88,815, మహిళలు 94,340 మొత్తం ఓటర్లు 1,83,158 మంది ఉన్నారు. , పెనమలూరు నియోజకవర్గంలో పురుషులు 1,38,540, మహిళలు 1,48,136,, మొత్తం ఓటర్లు 2,86,679 మంది ఉన్నారు.

2023 అక్టోబర్ 1 జనన ధృవపత్రం తప్పనిసరి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: 2023 అక్టోబర్ 1 తరువాత జన్మించిన వారికి జనన నమోదు ధృవపత్రం తప్పనిసరని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్లు, జిల్లాఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రూప్- 1 సర్వీసెస్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం తదితర అంశాలపై జరిపిన సమీక్షను,క్యాంపు కార్యాలయం(కలెక్టర్ బంగ్లా)నుండి వీక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జనన, మరణ నమోదు (సవరణ) చట్టం 2023 గత ఏడాది అక్టోబర్ 1 నుండి అమల్లోకి వచ్చిందన్నారు. దీని ప్రకారం 2023 అక్టోబర్ 1 తరువాత జన్మించిన వారు పాఠశాలల్లో అడ్మిషన్లు, ఆధార్ నమోదు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్పోర్ట్ , ఓటు హక్కు నమోదు, వివాహ నమోదు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు వంటి వాటికి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఇప్పటివరకు నిర్వహించిన 281 క్యాంపుల్లో ఒక్కో క్యాంపులో సరాసరి 468 మందికి ఓపి వైద్య సేవలు అందించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. మొత్తం 1,31,585 మందికి ఓపి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో 3,028 మందికి ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందించి నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి. గీతాబాయి, డ్వామా పిడి జివి. సూర్యనారాయణ, ఎస్ఈ పి ఆర్ విజయకుమారి, తదితర అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 18వ తారీకు నుంచి ఏప్రిల్ 2వ తారీఖు వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యాశాఖ అధికారి-1 ఎస్ శివశంకరరావు, మండల విద్యాశాఖ అధికారిణి -2 కే శ్రీలక్ష్మి శనివారంతెలిపారు. మండలంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోనిరెగ్యులర్ విద్యార్థులు 544 మందితోపాటు180 మంది సప్లిమెంటరీ విద్యార్థులు కలిపి 724 మంది మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు హాజరవుతారని వివరించారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతి గదికి 20 మంది పరీక్ష రాసే విధంగా గదులలో బల్లలు ఏర్పాటు చేసినట్లుపేర్కొన్నారు. అలాగే కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, తోపాటు ఆరోగ్య కేంద్ర సిబ్బందిని మందుల పంపిణీకి ఏర్పాటు చేశారని వెల్లడించారు. కోసూరు పరీక్షాకేంద్రంలోఘంటసాల మండలం మల్లంపల్లి విద్యార్థులు 12 మంది పరిష్కారం హాజరవుతారు అన్నారు. మొవ్వ ఏ కేంద్రంలో 170 మంది, మొవ్వ బి కేంద్రంలో 140 మంది, పెడసనగల్లులో 106 మంది, కోసూరులో 90 మంది, కాజలో 83 మంది, కూచిపూడి లో 72 మంది, నిడుమోలులో 63 మంది పరీక్షల్లో పాల్గొంటారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారని, అలాగే పరీక్షా అధికారులు కేంద్రాలకు సెల్ ఫోన్లు తీసుకురాకూడదని వివరించారు. ఇదిలా ఉండగా ఇన్విజిలేటర్స్ తో సమావేశాలు నిర్వహించి పరీక్ష కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిఎస్,డిఓలుసూచనలు ఇచ్చారు.

మండలంలో సి.ఎస్,డి.వోలు వీరే

కూచిపూడి పరీక్ష కేంద్రానికి సి హెచ్ ఎస్ కే బి సుబ్రహ్మణ్యం (సిఎస్), పి శ్రీనివాసరావు (డివో), కాజ కేంద్రానికి ఎస్.ఎస్. సాయికుమార్, ఎస్ సుబ్రహ్మణ్యేశ్వర రావు, కోసూరు కేంద్రానికి గుడివాడ శ్రీహరి, జి ఉషారాణి, పెడసనగలు కేంద్రానికి ఎస్ వి కోటేశ్వరరావు, ఏ చంద్రశేఖర్, నిడుమోలు కేంద్రానికి మీర్జా ఆలీ రజా, అర్జా విజయ్, మొవ్వ ఏ కేంద్రానికి కే శిరీష, ఎస్. సుధాకర్ రావు, మొవ్వ బి కేంద్రానికి కే మాధవి (సి ఎస్) సిహెచ్ సమతా అంబేద్కర్ (డివో) లుగా నియమించారు.

పది పరిక్షలకు 561 విద్యార్థులు సిద్ధం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మార్చి 16: ఈ నెల 18 వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయని మండల పరిధిలోని నాలుగు కేంద్రాల్లో మొత్తం 561 మంది పరీక్షలు రాయనున్నారని ఎమ్మీఒ 2 శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాడంకి కేంద్రం గా 183, కపిలేశ్వరపురం కేంద్రం లో 185(కపిలేశ్వరపురం, హనుమంతపురం, చోరగుడి) పమిడిముక్కల కేంద్రం లో 91(పమిడిముక్కల, జీసస్ పాఠశాల) మేడూరు కేంద్రం లో 102(మేడూరు, అగినపర్రు, ఐనపూరు) విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ప్రతి కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ లేదని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేటట్లు ఏర్పాటు చేశామని ఎమ్మీఒ 2 శ్రీనివాస్ తెలిపారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర -కృత్తివెన్ను : మాట్లం మారుమూల గ్రామంలో మంచినీటి సమస్యకు త్వరలో పరిష్కారం చూపిస్తానని వైసిపి అభ్యర్థి ఉప్పాల రాము హామీ ఇచ్చారు. శనివారం ఆయన జడ్పీ చైర్మన్ ఉప్పల హారికతో కలిసి గ్రామంలో ప్రజా దీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.45 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. గతంలో కొందరు రైతులు గ్రామానికి మంచినీటి చెరువుకి భూమి ఇస్తామని హామీ ఇచ్చిన విషయ విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. దాతలు ఇస్తే సరే లేనిపక్షంలో ప్రభుత్వం ద్వారా గాని తన సొంత ఖర్చులతో అయినా సరే మంచినీటి చెరువుకు భూమిని ఏర్పాటు చేస్తానని గ్రామస్తులు హామీ ఇచ్చారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందని గుర్తు చేశారు. తనకు శాసన సభ్యుడిగా మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొనసాని గరుడ ప్రసాద్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, జడ్పిటిసి సభ్యురాలు మైలా రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధరరావు, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ వైధాని వెంకటరాజు, మలిశెట్టి రాజబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కూనసాని లక్ష్మోజీ, పట్టపు నాని, ఈదా కిషోర్, జన్యావుల ఝాన్సీ, జల్లా భూపతి, తమ్ము ఏడుకొండలు, తిరుమాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజలు

విశాలాంధ్ర-చల్లపల్లి : గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం భూమిపూజ చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబులు పాల్గొని పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు సభ్యులు షేక్ సిలార్, మీర్ రిజ్వాన్, ఈవో పీవీ. మాధవేంద్రరరావు, రావులపల్లి పండు, రావి చిట్టి, కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులకు విముక్తి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల న్యాయ సాధికారసంస్థ ఆధ్వర్యంలో మొవ్వ న్యాయస్థానంలో శనివారం మధ్యాహ్నం నుంచి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పలు కేసులు పరిష్కరించారు. న్యాయమూర్తి పి రాజన్ ప్రకాష్ ఉదయ్ ఆధ్వర్యంలో రాజీమార్గమే రాజమార్గం, సత్వర న్యాయం సమన్యాయం నినాదంతో మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల పరిధిలోని పలు కేసులను పరిష్కరించారు. కూచిపూడి (మొవ్వ), పోలీస్ స్టేషన్ పరిధిలో 31, ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలో 10, చల్లపల్లి మోపిదేవి పోలీస్ స్టేషన్ పరిధిలో 15 పరిష్కారమయ్యాయనిఆయా స్టేషనుల పోలీసు వర్గాలు వెల్లడి చేశాయి.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా శిబిరం



విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లో ఉచిత నేత్రపరీక్షా శిబిరం జరిగింది. డాక్టర్ వెంకట్రావ్ 52 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 15మందికి ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమని నిర్ధారించగా, వారిని గూడూరు సాయి నేత్ర వైద్యాలయంకు పంపారు. లయన్స్ ముఖ్యులు దుబ్బుల సాంబశివరావు ఆర్థిక సహకారంతో జరిగిన శిబిరాన్ని లయన్స్ పెద్దలు నర్రా సాయిబాబు, కొల్లిపర నాగ పోతురాజు, తగిరిశ సాంబశివరావు, ఏఎల్ ఆర్ కే ప్రసాద్, వరదా హరిగోపాలు పాల్గొని పర్యవేక్షించారు.

ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పెడన : పెడన పురపాలక సంఘ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్పర్సన్ కటకం నాగ కుమారి, వైస్ చైర్మన్ మహమ్మద్ ఖాజా ముఖ్య అతిథిగా విచ్చేసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెడన మున్సిపల్ కమిషనర్ బైగాని. వెంకటరామయ్య, కౌన్సిలర్లు, మరియు పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే అభివృద్ధి బాటలో గ్రామాలు : కైలే

విశాలాంధ్ర-కూచిపూడి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో పలు సంక్షేమ పథకాలు రాజకీయాలకు కులాలకు మతాలకు అతీతంగా అర్హతనే ప్రామాణికంగా తీసుకొని నిజమైన పేదలకు అందిస్తూ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వచ్చే నెలలో జరగబోయే ఎన్నికలకు ముఖ్యమంత్రిగా తీర్చిదిద్దడానికి ఆశీర్వదించాలని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులుకైలే అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. మొవ్వ మండలంలోని అయ్యంకి గ్రామంలో జడ్ల పరిషత్ నిధులు పది లక్షల రూపాయలతో మంజూరైన వెనకబడిన తరగతుల సామాజిక భవనానికి శనివారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఐదు సంవత్సరాలలో రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేశానని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో అసెంబ్లీకి, పార్లమెంటుకి రెండుఓట్లను ఫ్యాన్ గుర్తుకే వేసి వైఎస్ఆర్సిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాల రాజకీయ నాయకులు పలువురు ఓర్వలేక రాజకీయంగా వైఎస్సార్ సీపీ పార్టీని ఎదుర్కోలేక అవాకులు చవాకులు మాట్లాడుతూ అబాండాలు వేస్తూ తమ నైజాన్ని వెళ్ళగక్కుకుంటున్నారని, ప్రజలు నమ్మవద్దని కోరారు. భవిష్యత్తులో కూడా తమ ప్రభుత్వం హయాంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ ఉప్పలపాటి కాశీశ్వరమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్ (అయ్యంకి), పిఆర్ ఏఈ బి. రామారావు, ఏ.పి.ఎం. సిహెచ్ ప్రధాన రావు, మండల సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు,, పార్టీ నాయకులు రాజులపాటి మురళి, కొండేటి చందు పంచాయతీ కార్యదర్శి వక్కలగడ్డ నరసింహారావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా చినముత్తేవిలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు 20 లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్ సిమెంట్ రోడ్లను లాంఛనంగా ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల నియమావళి వచ్చే సమయం కావడంతోచివరి నిమిషంలో ప్రారంభించ కుండానే వెనుతిరిగారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : షాలిమిషనర్మీ చెన్నైకి చెందిన లెఫ్టినల్ చిప్ సెక్రటరీ స్టాలెన్ మాసిలామణి, కెజియల్ స్టాలెన్‌లు శనివారం చలివేంద్రన్ని ప్రాంరభించారు. శనివారం స్థానిక బేతవోల్ గేట్ సమీపంలోని ది షాలిమిషనర్మీ చర్చి డివిజనల్ మేజర్ ఇంటి దేవ ఎబినేజరే, పద్మవతిల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చెన్నైకి చెందిన షాల్‌మిషనర్మి లఫ్టినల్ స్టాలెన్ మాసిలామణి, కెజియల్‌లు ప్రారంభించి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పాదచారులకు దహం తీర్చిందుకు మజ్జిగ, తాగ్రునీరు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాగమ్ కోఆర్డ్ నేటర్ అబ్రహంలికంన్, డివిజన్‌స్థాయి షాలీమిషనర్మీ లీడర్స్, న్యాయవాది సిహెచ్ రాజేంద్రప్రసాద్, జోషప్, నీలంబరం, విజయకుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులు

విశాలాంధ్ర-చల్లపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సంఘ అధ్యక్షులు అన్నవరపు పాండురంగారావు పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడు అని స్మరించుకున్నారు. వారి జీవితచరిత్రను భావితరాలకు తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరదా హరిగోపాల్, కోశాధికారి తమ్మన సతీష్కుమార్, మారుతి,సాంబ, శ్రీను, రాజశేఖర్, సురేష్, నరేంద్ర, కళ్యాణమండపం అధ్యక్షులు కొల్లిపర మధు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం, వాసవి వనిత క్లబ్ ల ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి ఎపెదపూడిసెంటర్లోనిపాత స్టేట్ బ్యాంకు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి దాహార్తి తీర్చడం కోసం మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని కూడా ప్రారంభించారు తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయనలోని పట్టుదల దీక్షను త్యాగనిరతను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వాసవి వనిత క్లబ్ జోనల్.చైర్మన్ పలివేటి లక్ష్మి చలివేంద్రాన్ని ప్రారంభించి చల్లటి మజ్జిగను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలారపు మంగమ్మ, వాసవి వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏచూరి ఝాన్సీ వాణి, ఆలపాటి ప్రమీల రాణి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గార్లపాటి వెంకటరత్నం, వాసవి క్లబ్ అధ్యక్షుడు యెండూరి జగన్మోహన్రావు, కోశాధికారి కారుమూరి లక్షాధికారితో పాటు ప్రతినిధులు కోట వెంకటరత్నం, ఏచూరి మా శంకర్, చీకటిమర్లబాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం చాలా గొప్పదని, మరువలేనిదని జాయింట్ జిల్లా కలెక్టర్ డా.పీ.సంపత్‌కుమార్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జేసీ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వీ.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్.నాగలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఆంధ్రరాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా సీపీ కాంతి రాణా ఆదేశాల మేరకు శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఏడీసీపీ కనకరాజు, క్రైమ్ ఏడీసీపీ కృష్ణమూర్తి, సీసీఆర్ బీపీ ఏసీపీ వెంకటేశ్వర్లు, పోలీసుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : ఆదివారం సా॥ 6:23
సహరి : సోమవారం ఉ॥ 4:56

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి

విశాలాంధ్ర-విజయవాడ: సార్వత్రిక ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిందని.. ఇందుకు సంబంధించి జిల్లాలో ఈసీఐ మార్గదర్శకాలను పటిష్టంగా అమలుచేయాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సంబంధించి అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సమయం నుంచి 24 గంటల్లోపు ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు తదితరాలను తొలగించాలన్నారు. పబ్లిక్ ఆస్తుల వద్ద, బస్టాండ్, రైల్వే స్టేషన్, రైల్వే వంతెనలు, రోడ్‌వేలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్‌లు, హోర్డింగ్‌లు, బ్యానర్‌లు, జెండాలు, రాజకీయ ప్రకటనలు మొదలైనవి 48 గంటలలోపు తొలగించాలన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 72 గంటలలోపు ఇప్పటికే ప్రారంభించబడిన పనులు, ప్రారంభించని తాజా పనుల జాబితాలను, అభివృద్ధి, నిర్మాణానికి సంబంధించిన అన్ని విభాగాలు, ఎంసీసీ ఉల్లంఘనలపై ఫిర్యాదును పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సూచనల కోసం అందించాలన్నారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత రూపొందించబడే విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, టీకా సర్టిఫికెట్లు మొదలైన వాటిలో రాజకీయ నాయకులు, పార్టీల ఫోటోలు, సందేశాలు, చిహ్నాలు ఉండకూడదన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లపై రాజకీయ ప్రకటనలు వెంటనే తీసివేయాలని కలెక్టర్ తెలిపారు. ఎంపీల్యాడ్, ఎమ్మెల్యే ల్యాడ్ లేదా ఇతర ప్రభుత్వ పథకాల కింద నిధులు సమకూర్చబడిన నీటి ట్యాంకులు, అంబులెన్స్‌లు తదితరాలపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోటోలు ఉన్నట్లయితే వాటిని కప్పిఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీవిత భాగస్వామి రాజకీయ రంగంలో చురుగ్గా ఉన్న అధికారులందరూ ప్రధాన కార్యదర్శి నిర్దిష్ట అనుమతితో మినహా ఎన్నికలు పూర్తయ్యే వరకు సెలవుపై లేదా పర్యటనలో వారి ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్లకూడదని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వోద్యోగి ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలి. రాజకీయ పార్టీ నిర్వహించే ఏదైనా కార్యక్రమంలో పాల్గొన్నా, రాజకీయ ప్రచారంలో పాల్గొన్నా, రాజకీయ పార్టీల నుండి ఏదైనా ప్రయోజనం, బహుమతి పొందడం, ఎన్నికల సమయంలో అనవసరమైన ప్రభావాన్ని చూపడానికి ప్రయత్నించడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐపీసీ 171, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 123, 129, 134 మరియు 134ఏ సెక్షన్లను ఉల్లంఘిస్తే, అటువంటి ప్రభుత్వ ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో సాధారణ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమష్టి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు.

సీపీఐ నేత ధనేకుల మృతి

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ సీనియర్ నేత, ఏఐటీయూసీ నాయకులు ధనేకుల కోటేశ్వరరావు శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ తీవ్ర అనారోగ్యంతో (77) శుక్రవారం అర్ధరాత్రి పటమట లంకలోని కేశవ రెసిడెన్సీ తన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కోటేశ్వరరావు మరణవార్త తెలియగానే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరావు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్నీడి యల్లమందారావు, సీపీఐ కవులూరు గ్రామ కార్యదర్శిబొర్రా వెంకట సుబ్బారావు, నాయకులు బుడ్డి వాసు, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కోనేరు రమేష్, జమ్మల సాంబశివరావు, బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ మాజీ నాయకులు అన్నే వేణుగోపాల్, వీరభద్రరరావు, తదితరులు కోటేశ్వరరావు నివాసానికి వెళ్లి భౌతికకాయంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈయన మైలవరం నియోజకవర్గం కవులూరు గ్రామానికి చెందిన తొలితరం నేత దశరధరామ్య పెద్ద కుమారుడు అని తెలిపారు. కవులూరు, కొండపల్లి గ్రామాలలోతో పాటు మైలవరం నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ప్రముఖుడుగా పేరుగాంచారని గుర్తు చేశారు. దశరధరామయ్య తన సంతానాన్ని బాల్య దశ నుంచి కమ్యూనిస్టులుగా తీర్చిదిద్ది వారికి కమ్యూనిస్టు నాయకులు పేర్లు పెట్టటమే కాకుండా వారికి ఉద్యమాల్లో నడిపించారని తెలిపారు. వారి కుమారులైన కోటేశ్వరరావు, రాజేశ్వరరావు, సుందరయ్యలు ఆ కమ్యూనిస్టు భావాలు, విలువలతోనే ఇప్పటికీ కొనసాగుతూ ఆదర్శనీయంగా నిలిచారని చెప్పారు. శనివారం సాయంత్రం విజయవాడలో అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

విశాలాంధ్ర-విజయవాడ : మొగల్‌రాజపురంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు సందడి చేశారు. ఇన్‌చార్జిలు కృష్ణవేణి, దుర్గ, ఉపాధ్యాయురాలు మాధురిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమం ఆకట్టుకుంది. చిన్నారులు తయారుచేసిన వివిధ ప్రాజెక్టులు, వాటి గురించి వివరించడం ఆకర్షణీయంగా మారింది. ప్రాజెక్టుల గురించి స్కూల్ ప్రిన్సిపాల్ సబానా అడిగిన ప్రశ్నలకు చిన్నారులు చక్కటి సమాధానాలు చెప్పారు.

165 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణ శివారు ప్రాంతమైన తొర్రగుంటపాలెం నందు స్థానిక వార్డు కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో 165 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎక్కడ పచ్చగా ఉన్న టిడిపి వారు ఓర్వలేక పోవడం సర్వసాధారణం అయిపోయిందని అన్నారు. తొర్రగుంటపాలెం నందు ఇళ్ల స్థలాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతుండగా వార్డు కౌన్సిలర్ వెంకటకృష్ణ ప్రసాద్ ఇళ్ల స్థలాలు తీసుకురావాలని ఎంతో కృషి చేశాడని అన్నారు. కానీ టిడిపి వారు ఆ స్థలం మాదేనని దొంగ పట్టాలు పుట్టించి పలువురు చేత హైకోర్టులో కేసులు వేయించి అడ్డుకున్నారని దీనివల్ల గత కొంతకాలంగా ఎంతో జాప్యం జరుగుతూ వచ్చిందని అన్నారు. కాగా కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో 165 మందికి పట్టాలు అందజేయగలుగుతున్నామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా టిడిపి వారు మీ ఇంటికి వచ్చి ఓట్లు అడుగుతారని మరలా మయ మాటలకు మోసపోవద్దని చెప్పారు. టిడిపి వారు గతంలో అధికారంలో ఉండి కూడా ఎందుకు ఇళ్ల స్థలాలు తీసుకురాలేదని, ఎందుకు అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించలేదని, టిటిడి కళ్యాణమండపం ఎందుకు నిర్మించలేదని, డ్రైనేజీలు ఎందుకు నిర్మించలేదని, ఆర్వో ప్లాంట్ ఎందుకు తీసుకురాలేదని నిలదీయండని సూచించారు. కానీ నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా మీకు మేలు జరుగుతేనే ఓటు వేయండి అని అంటున్నారని రాబోయే ఎన్నికల్లో వైసిపీ కి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు బాలుడి మృతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలంలోని శివాపురం గ్రామానికి చెందిన సాగర్(13) పాముకాటుకు గురై మృతిచెందాడు. వివరాల ప్రకారం ఆదిలాబాద్ నుంచి వచ్చిన మిర్చి వలస కూలీలువారిలో వచ్చిన సాగర్ ప్రమాదవశాత్తు శనివారం పాముకాటు గురయ్యాడు. 108లో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడని వైద్యులు తెలిపారు.

పోషకాహారంపై దృష్టి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలకేంద్రం అయిన పెనుగంచిప్రోలు లో పోషణ ప క్షో త్స వాలల్లో భాగం గా శనివారం చిల్లకల్లు ప్రాజెక్టు. ఐ సి డి ఎస్. సిడి పి ఓ. జె. లక్ష్మి భార్గవి ఆదేశాల మేరకు సూపర్వేజర్ ఉషా రాణి ఆధ్వర్యంలో గర్భిణీ లకు రక్త పరీక్షలు జరిపించడం. 5 సంవత్సరాలు లోపు చిన్న పల్లలకు ఐరన్ సిరఫ్ వే పించడం.మరియు కిశోరీ బాలికలకు సిరుధాన్యాలతో అవగాహన కల్పించి న్నారు.అలాగే వ్యక్తి గత పరిశు భ్రత గూర్చి అవగాహన కల్పించి న్నారు.కిశోరీ బాలికలకు చిరుధాన్యాలు గురించి వాటి ఉపయోగం గురించి వ్యాచారచనపోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ కెలు.ఏ ఎన్ ఎం లు. ఆశాలు.అంగన్వాడీ వర్కర్లు. స్కూల్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

జమకా మృతి వైసీపీకి తీరని లోటు

విశాలాంధ్ర-ఏ కొండూరు : ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కృష్ణారావు పాలెం గ్రామపంచాయతీ ఎనిమిదవ వార్డు సభ్యురాలు భరోతు జమక (51)మృతి వైసిపి పార్టీకి తీరని లోటని దీప్లానగర్ తండా వార్డు సభ్యురాలిగా ఎన్నికైన ఆమె నిత్యం తండా అభివృద్ధిపై దృష్టి సారించి తండా అభివృద్ధికి తన వంతు కృషి చేశారని సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి చంద్ర మోహన్ రావు అన్నారు జమక శనివారం కిడ్నీ వ్యాధితో మృతి చెందిందని ఆమె కుటుంబానికి తమ పార్టీ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆమె పేర్కొన్నారు జమకా కుటుంబ సభ్యులను సర్పంచ్ తన భర్తతో కలిసి వెళ్లి పరామర్శించి ఓదార్చారు జమక మట్టి ఖర్చులు నిమిత్తం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు జడ్పిటిసి భూక్యాగనియా ఎంపీటీసీ భరోత్ వెంకటేష్ నాయక్ కేసియ్య గ్యామా తండా సర్పంచ్ జరబల జమలమ్మ పెద్దబాబు లు పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతానికి మృతి

విశాలాంధ్ర-నందిగామ: విద్యుత్ ఘూతానికిగురై ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నందిగామ మండలం గొల్లమూడి గ్రామంలో చోటుచేసుకుంది.సమాచారం మేరకు గ్రామానికి చెందిన కటారపు రామారావు(53) పొలాలలో మోటర్లు , కరెంటు రిపేరు తోపాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం పొలంలో కరెంట్ స్తంభం కి నిచ్చిన వేసుకుని కరెంటు వైర్లు సరి చేస్తుండగా విద్యుత్ షాక్కు గురై కింద పడి మృతి చెందాడు.అతనికి భార్య వెంకట్రావమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు, రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, గ్రామ సర్పంచ్ కట్టారపు కృష్ణ, జడ్పిటిసి గాదెల వెంకటేశ్వ రావులు మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

రెండు దశాబ్దాల టీటీడీ కల్యాణ మండపం కల సాకారం

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : స్థానిక తొర్రగుంటపాలెం నందు 3.5 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన టిటిడి కళ్యాణ మండపాన్ని శనివారం రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో టిటిడి కళ్యాణమండపం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాలుగా టిటిడి కళ్యాణమండపం లేక ఎంతో ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజల కోసం తాను 2008లో స్థలాన్ని సేకరించి శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. మళ్లీ నేను 2019లో అధికారంలోకి వచ్చాక నిధులు మంజూరు చేయించి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. 2008 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న శ్రీరామ్ తాతయ్య ఎమ్మెల్యేగా చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటికీ టిటిడి కళ్యాణమండపం నిర్మించుకోకపోవడం బాధాకరమన్నారు. పట్టణ ప్రజల పట్ల ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించడం ఈ సంఘటన రుజువు చేస్తుందన్నారు. ఇదే కాకుండా పలు అభివృద్ధి విషయాల్లో నిర్లక్ష్యం వ్యవహరించారని తెలిపారు. నేడు తాను అధికారంలోకి వచ్చాక 2000 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మరలా మీరు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్లు తొలగించిన మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-నందిగామ: ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని దగ్గరుండి పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల కు సంబంధించిన బ్యానర్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషన్ దగ్గరుండి మున్సిపల్ సిబ్బంది ద్వారా వివిధ రాజకీయ పార్టీల కు సంబంధించిన బ్యానర్లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ ఈరోజు నాలుగు గంటల నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు ఫోటోలు తొలగించామని నందిగామ అర్బన్ కు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారిగా సురేష్ నియమించారని నందిగామ అర్బన్ కు సంబంధించి ఎటు వంటి కంప్లైంట్లు చేయాలనుకున్న పురపాలక సంఘ అధికారులకు ఇన్ఫార్మ్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నామ్స్ ప్రకారం చర్యలు తీసు కుంటామని ఆమె అన్నారు.ఈ కార్య క్రమంలో ఆర్ ఐ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల నిత్యాన్నదాన పథకానికి కూరగాయలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : దాతల సహకారంతో తిరుమల నిత్యాన్నదాన పథకానికి కూరగాయలను పంపుతున్నట్లు ప్రముఖ వైద్యులు ఎస్వీ.రంగారావు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి దాతల సహకారంతో మరడ నాగేంద్ర ఆధ్వర్యంలో సూర్యారావుపేటలోని ఆర్కే హాస్పిటల్ వద్ద నుంచి శనివారం బయలుదేరిన కూరగాయల వాహనానికి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు లక్షలాది మందికి అన్నదానం అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న బృహత్కార్యంలో తాము కూడా భాగస్వాములు కావడం భగవంతుని ఆజ్ఞగా భావిస్తున్నామన్నారు. సమాజంలో ఎంతోమంది వారి శక్తి మేరకు ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి ఉండే మత విశ్వాసాల ఆధారంగా వారి వారి విశ్వాసాల ప్రకారం భగవదనుగ్రహం పొందడం కోసం చేసే సేవలలో ఆహారం పంపిణీ చాలా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కార్యక్రమం నిర్వాహకులు ఎం.నాగేంద్ర మాట్లాడుతూ 2004లో ప్రారంభించిన ఉచిత కూరగాయల పంపిణీ కార్యక్రమం దాతల సహకారంతో ఇప్పటి వరకు నగరం నుండి సుమారు 25 వేల టన్నులు కూరగాయలను టీటీడీకి వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. త్రిపుర సుందరి డా.ఈశ్వర్ డా.రత్న పలువురు విద్యారంగ ప్రముఖులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

నేను సూర్యదేవర నరసింహారావు, తండ్రి: సూర్యదేవర వెంకటేశ్వరరావు, నివాసం: ఫ్లాట్ నెం. 6, రఘు అపార్ట్‌మెంట్స్, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, విజయవాడ, యన్.టి.ఆర్. జిల్లా. నేను నా స్వార్జితపు సొమ్ముతో ది. 07-05-1985వ తేదిన ది ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌస్-బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, బంజరగూడా తాలూక, సంగారెడ్డి రి.జి.నెం. టి.బి.925 అండర్ ఎ.పి.సి.యస్. యాక్ట్ ఆఫ్ 1964 వారి ద్వారా క్రయమును పొంది మెదక్ జిల్లా సంగారెడ్డి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు దస్తావేజు నెం. 5365/1985 రిజిస్టరు కాబడిన విక్రయ దస్తావేజు కీర్తా మెదక్ జిల్లా, సంగారెడ్డి తాలూక పటాన్‌చెరు గ్రామ సర్వే నెం. 650/2రు దాఖలా ప్లాట్ నెం. 472-జి రు దాఖలా చ॥గ॥ 300లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము సంక్రమించియున్నది. సదరు ఆస్తి ఒరిజనల్ దస్తావేజు ది. 08-03-2024న విజయవాడ గుణదల ఇ.యస్.ఐ. హాస్పటల్ ఏరియాలో పోయినవి. సదరు ఆస్తి దస్తావేజులు ఎంత వెతికినను కనిపించలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినచో పై అడ్రస్‌లో అందచేయ గలరు. ✆ 94401 63065

ముజావారుల కమిటీలో అవకతవకలపై విచారించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : హజరత్ గాలిబ్ షహీద్(ర.అ)దర్గా షరీఫ్ ఖిల్లాపై ఉన్న హజరత్ సర్‌ముభారక్ దర్గాషరీఫ్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నరని వాటిపై ప్రభుత్వంతోపాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డు విచారణ చేసి నిజమైన పేద ముజావరుకలు న్యాయం చేయాలని మాజీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ అహ్మద్ అన్సారి డిమాండ్ చేశారు.శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాల క్రితం పదవీ బాధ్యతలు ముగిసినప్పటికి నూతన కమిటీ వేయకుండా కాలయాపన చేస్తూ కమిటీ ప్రెసిడెంట్ అని చెప్పుకుంటూ అల్తాఫ్ రజా అనే వ్యక్తి నిధులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. కట్టుబడిపాలెం లో దర్గాకి చెందిన 60 ఎకరాల భూమిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ భూసేకరణ లో తీసుకోగా వచ్చిన పరిహారం వివరాలు,కొండపల్లి బి కాలనీ దగ్గర 14 ఎకరాల భూమిని అమ్మగా వచ్చిన డబ్బులు,అదేవిధంగా దర్గా వద్ద ఉన్న 4 షాపులు,షాదీఖాన అద్దెల వివరాలు నేటి వరకు ఎవ్వరికీ చెప్పకుండా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత 22 సంవత్సరాలుగా దర్గాకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై వక్ఫ్ బోర్డు సీఈఓ,జిల్లా కలెక్టర్ లు విచారణ జరిపి బహిర్గతం చేయాలన్నారు.అదే విధంగా నూతన కమిటీని ఏర్పాటు చేసి ముజావారులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ షాహీన,సయ్యద్ మెహరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేత

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : స్థానిక కేడీసీసీ బ్యాంకు వారి సహకారంతో మున్సిపల్ కార్యాలయం నందు జగ్గయ్యపేట పట్టణానికి చెందిన 60 మంది టైలర్స్ కు కుట్టు మిషన్లను రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దర్జీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం పదివేల రూపాయలు దర్జీలకు అందిస్తూ వారు ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. జగ్గయ్యపేటలో టైలర్స్ అసోసియేషన్ వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి స్థానిక డిపో సెంటర్ నందు ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేడీసీసీ బ్యాంకు ద్వారా 60 మంది సభ్యులకు సబ్సిడీపై కుట్టు మిషన్లు అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బాలామృతం ఒక వరం : సీడీపీఓ నాగమణి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చిన్న పిల్లల ఎదుగుదలకు బాలామృతం ఒక వరమని సీడీపీఓ నాగమణి అన్నారు. శనివారం విజయవాడ గిరిపురంలోని 2వ సెంటర్‌లో పోషక్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగమణి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే వివిధ పోషకాలతో కూడిన బాలామృతాన్ని తల్లులు తీసుకుని పిల్లలకు వాడాలని సూచించారు. అది వారి ఎదుగుదలకు దోహదం పడుతోందన్నారు. పౌష్టిక ఆహారం వక్షోత్సవాలలో భాగంగా గిరిపురంలో 2వ సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం వినియోగం పై తల్లుకు అవగాహన కల్పించారు. అలాగే ఐసీడీయస్ ప్రాజెక్ట్-1 సూపర్‌వైజర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ ఐరన్, పోలిక్‌యాసిడ్, విటమిన్ బీ 12 వంటి పోషక పదార్థాలతో కూడిన ఈ బాలామృతాన్ని 7 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పెట్టాలని సూచించారు. హెల్త్ విజిటర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ పిల్లల బరువు, ఎత్తు, ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలని తెలిపారు. పిల్లల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తులేని పక్షంలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వై.శైలజ, సహాయకురాలు కే.నాగరాణి, గర్భవతులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజల పట్ల బాధ్యత, నిబద్ధత, జవాబుదారీ తనంతో పనిచేశాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల పట్టణంలోని కలేకూరి ప్రసాద్ కాలనీ, అంబేద్కర్ న్యూ కాలనీ లలో "గడపగడపకు -మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ, వారి ఇల్లు -కార్యాలయాల చుట్టూ ప్రజలు తమ ఆత్మాభిమానాన్ని కోల్పోయి కాళ్లు అరిగేలా తిరిగిన పరిస్థితి ఉంది.ఓటు వేసినా వేయకపోయినా పార్టీలు చూడలేదు, కుల మతాలు చూడలేదు. రాజకీయం చేయలేదు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీ వారికి సహా జగనన్న సంక్షేమ పథకాలు అందజేసి మంచి చేశాడు.చంద్రబాబు హయాంలో తెలుగు దేశం పార్టీ కండువా కప్పుకుంటేనే వాళ్లు చెబితేనే పథకం ఇచ్చేవాళ్లు ఎవరి పాలన బాగుందో ప్రజలే చెప్పాలి.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు: ఎంఈఓ కెనడీ

విశాలాంధ్ర-వీరులపాడు: పదవ తరగతి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ కెనడీ తెలిపారు.పరీక్షలు మార్చ్ 18 నుండి 30 తేదీ వరకు జరుగుతాయని,వీరులపాడు మండలానికి సంబంధించి నాలుగు పాఠశాలలు వీరులపాడు, జయంతి, అల్లూరు,జుజ్జూరు పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 684 విద్యార్థులు పరీక్ష కు హాజరు కానున్నారు. 8.30 నుండి 12.30 వరకు పరీక్షా సమయమని, విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు మాల్ ప్రాక్టీసింగ్ కి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొట్టి శ్రీరాములుకి ఘన నివాళులు

విశాలాంధ్ర-వత్సవాయి : శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక వత్సవాయి మెయిన్ రోడ్డు మీద ఉన్నటువంటి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీ తుమ్మేపల్లి నరేంద్ర , గుర్రం మోహన్ రావు హనుమంతరావు దుగ్గి ఉమామహేశ్వరరావు చిరునోములు రమేష్ , గుర్రం రమేష్ , యర్రా శ్రీనివాసరావు, జిల్లా గురునాథం తదితరులు పాల్గొన్నారు.

In the Court of the V Addl Junior Civil Judge at Vijayawada

O.S.No. 594/2020

Between :
Canara Bank, (Erstwhile Syndicate Bank), Gandhinagar Branch, Rep. by its Senior Branch Manager, Vijayawada - Plaintiff

And

K. Silpa and another - Defendants

Defendant No.1 :
Komaravalli Silpa, W/o. Jagadeesh Babu, R/o. Flot. No. 316, Siddi Apartments, H.B. Colony, Near Police Station, Bhavanipuram, Vijayawada-12.

Defendant No.2 :
Komaravalli Jagadeesh Babu, S/o. Nagabhushanam, R/o. Flot No.316, Siddi Apartments, H.B. Colony, Near Police Station, Bhavanipuram, Vijayawada-12.

పై నెంబరు దావాలో ఒకటి మరియు రెండవ ప్రతివాదులు అయిన మీకు పై దావా సమన్లు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా సదరు దావా సంగతులు తెలియచేయ వలసినదిగా పై కోర్టువారు ఆదేశించియున్నారు. కావున ది. **26-03-2024వ తేదీన ఉదయం 10.30ని॥లకు** పై కోర్టువారి ఎదుట స్వయంగాగాని లేక న్యాయవాది ద్వారాగాని హాజరై మీయొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : **26-03-2024**

B. Suryanarayana Kumar,
B.Com, B.L. (BSNK)
Advocate, BSNK LAW Associate, #32-15-104, 1st Floor, 0-1 Classic Towers, Ratnamamba Street, Moghalrajpuram, Vijayawada - 520010.
Cell : 98480 17859
Vijayawada : 09-03-2024

సీటు రాలేదని అల్లరి చేస్తే సస్పెండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జనసేన పార్టీకి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలు శిరోధార్యమని, సీటు రాలేదని పార్టీని రోడ్లపై అల్లరి చేస్తే పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ పార్టీ అసమ్మతి వాదులను హెచ్చరించారు. శనివారం భవానిపురంలోని వివిఎంసి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనసేన , తెలుగుదేశం,బిజెపి కూటమి అభ్యర్థుల విజయానికి జనసైనికులు పనిచేయాలని శంకర్ పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలకు భిన్నంగా ఎవరైనా ప్రయత్నించినా,రోడ్డు మీదకు వచ్చి అల్లరి చేసినా సహించేది లేదని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ ఎవరికీ సీటు ఇస్తామని హామీ ఇవ్వలేదని, పార్టీ ఇన్చార్జీలకు గాని, జిల్లా అధ్యక్షులు గాని ఎన్నికల్లో నీకే సీటు ఇస్తామని చెప్పలేదని అల్లరి చేస్తున్న వారు గుర్తించాలని శంకర్ హెచ్చరించారు. సీటు రాలేదని అల్లరి చేస్తున్న వారు ఎవరికి వారే ఈ సీటు నాదే అనుకుని ఇప్పుడు సీటు రాలేదని పార్టీని అల్లరి చేస్తే సహించబోమని అన్నారు. జనసైనికులు క్రమశిక్షణతో వ్యవహరించి పవన్ కళ్యాణ్ ఆదేశాలను పాటించాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించకూడదని శంకర్ కోరారు. జనసేన పార్టీ నాయకత్వానికి భిన్నంగా పార్టీని రోడ్డు మీదకు లాగితే సహించేది లేదని అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బిజెపికి కేటాయించినా కూటమి అభ్యర్థుల విజయానికి జన సైనికులు కృషి చేయాలని బాడిత శంకర్ స్పష్టం చేశారు. కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనా పార్టీ నిర్ణయం ప్రకారం వారిని గెలిపించే తీరుతామని చెప్పారు. పవన్ కళ్యాణ్ నిర్ణయాన్ని శిరసా వహిస్తామని చెప్పారు. జనసేన పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపును పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఇస్తారని చెప్పారు. చిలకలూరిపేటలో ఈ నెల 17న జరగనున్న ప్రజా గళం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జనసేన నాయకులు జనసేన విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, జనసేన 47 వ డివిజన్ అధ్యక్షులు వేంపల్లి గౌరీ శంకర్ , జనసేన నాయకులు సముద్రాల ప్రసాద్, ఆవుల ప్రసాద్, ఉమ్మడిశెట్టి కృష్ణ, ఎం సంగీత, ఎం ఎస్ ఆర్ నాయుడు, బాడిత చరణ్ , తంగా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ లో అమ్రిత సాయి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి లో నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్ట్ లో కబడ్డీ, బాడ్మింటన్ విభాగాలలో సత్తా చాటి బహుమతులు కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం యమ్.శశిధర్ తెలియ చేసారు.ఇటీవల ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదిక గా, నిర్వహించిన జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ కబడ్డీ విభాగం లో వివిధ రాష్ట్రాల నుండి మొత్తం 32టీమ్స్ పోటీ పడగా,అమ్రిత సాయి కళాశాల కబడ్డీ జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుందని కళాశాల సెక్రటరీ %ఞ% కరస్పాండెంట్ శ్రీ కె. రామ్మోహన రావు తెలియ చేసారు. అంతే కాకుండా కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో కబడ్డీ విభాగం లో మొత్తం 40 జట్లు పోటీ పడగా అమ్రిత సాయి జట్టు రెండవ స్థానం కైవసం చేసు కున్నది. అమ్రిత సాయి కళాశాల కబడ్డీ టీం మెంబెర్స్ కు,టోర్నమెంట్ నిర్వాహకులు మొమెంటో,ప్రశంస పత్రాల తో పాటు నగదు బహుమతి, విన్నింగ్ కప్ అందజేశారు. విట్ యూనివర్సిటీ నిర్వహించిన పోటీలలో బాడ్మింటన్ విభాగం లో అమ్రిత సాయి విద్యార్థులు రన్నర్స్ గా నిలిచారని ప్రిన్సి పాల్ డా ఎమ్.శశిధర్ తెలియ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల లో విద్యార్థులకు అకడమిక్స్ తో పాటు క్రీడల లో కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని , దీని ఫలితంగా అద్భుత విజయాలు సాధించటం తో పాటు యూనివర్సిటీ స్థాయి లో రాణిస్తున్నామని తెలిపారు.గెలుపొందిన కబడ్డీ మరియు బాడ్మింటన్ టీం విద్యార్థులను సెక్రటరీ %ఞ% కరస్పాండెంట్ శ్రీ కె. రామ్మోహన రావు, ప్రిన్సిపాల్ డా ఎం యమ్.శశిధర్, అకాడమిక్ డైరెక్టర్ డా ఎం పి. చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డా ఎం యమ్ .శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్స్ పి.శ్రీనివాస రావు, పి. శివ రామ కృష్ణ, అన్ని విభాగాల అధిపతులు అభినందించారు.

అలీ బేగ్‌కు సత్కారం

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటిస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్ని విజయవాడ లబ్బీపేట మశీదు వీధిలో ఉన్న కార్యలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్ విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఫజులుద్దీన్ సయ్యద్ సజ్జద్, మొహమ్మద్ రఫీ ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్ర వైఎస్సార్సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్, చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్కి తూర్పు నియోజకవర్గ వైసిపి నాయకులను ప్రత్యేకంగా పరిచయం చేశారు..

మిక్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ ప్రతి ఏటా నిర్వహించే వార్షికోత్సవ వేడుకలు మిక్ ఫెస్ట్ 2024 శనివారం ఘనంగా నిర్వహించి నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.వంశీ కిరణ్ తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు వివిధ రకాల ఆటలు, ఆహారం, ఫోటోగ్రఫీ, వంటి వివిధ రకాల స్టాల్స్ నిర్వహించి వారి వ్యాపార నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు. అంతేకాకుండా కళాశాల విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. హైదరాబాద్ కు చెందిన మ్యూజిక్ బ్యాండ్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం, బైక్ స్టంట్ అందరినీ అలరించింది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కళాశాల అన్ని విధాలా తగిన సౌకర్యాలను కల్పిస్తుందని కళాశాల సి.ఈ.ఓ డి.పాండురంగారావు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాభివృద్ధికై పలు రకాల శిక్షణా కార్యక్రమాలను కళాశాలలోనే నిర్వహించి వారి ఉపాధి అవకాశాలను ఎంతగానో మెరుగుపర్చినట్లు కళాశాల మేనేజ్ మెంట్ మెంబర్ ఎం. సుహాస్ తెలిపారు.ఈ కారక్రమంలో కళాశాల సి.ఈ.ఓ. డి పాండురంగా రావు, మానేజ్మెంట్ మెంబెర్ ఎం. సుహాస్, ప్రిన్సిపాల్ డా. టి. వంశీ కిరణ్, మిక్ ఫెస్ట్ కో ఆర్డినేటర్ సిహెచ్. విజయ్ కుమార్, ఎస్ వి సుబ్బారావు, డాక్టర్. డి. ప్రసాద్ వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రొయ్యల సాగుదారులకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రొయ్యల సాగుదారులకు గిట్టుబాటు ధర కల్పించాలి,రొయ్యల ధరను నియంత్రిస్తున్న ప్రాసెస్ యూనిట్లు వ్యాపారస్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏపి ఫిషర్‌మెన్ జెఎసి ఛైర్మన్ సైకం రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగం తరువాత, ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న రంగం మత్స్య అనుబంధ రంగాలే. సుమారు 40 లక్షల జనాభా కలిగిన సాంప్రదాయ మత్స్యకారులు చేపలవేట- అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న విషయం తెలిసినదే. అయితే, మత్స్యకారులకు చేపల వేట తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఆక్వా రంగం. తీర ప్రాంతంలోని మత్స్యకారులు పెద్ద యెత్తున రొయ్యల సాగును చేపడుతూ, ఉపాధి పొందుతున్నారు. ఆక్వా సాగుకు అనుబంధంగా రొయ్యసీడ్, రొయ్యమేత, కెమికల్స్, ఫ్యాన్లు, ప్రాసెస్ యూనిట్లు, హేచరీస్, రవాణ, కూలీలు, రొయ్య వలపట్లు, వ్యాపారులు వంటి వివిధ వర్గాల ప్రజలు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తోన్నారన్నారు.ఇంతటి విశిష్టత కలిగిన ఆక్వా రంగంపైన, ఆ వర్గ ప్రజలపైన ప్రభుత్వం సవతిప్రేమ చూపిస్తోంది. ఆక్వా సాగుదారులకు, మార్కెట్కు అనుగుణంగా ధర కల్పనలో కీలకపాత్ర వహించాల్సిన ప్రభుత్వం రొయ్యల ప్రాసెస్ యూనిట్లు, హేచరీల కంపెనీల యాజమాన్యాల చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా ధర నిర్ణయించవలసిన ప్రభుత్వాలు, చేతులెత్తేశాయి. ప్రక్క రాష్ట్రం తమిళనాడుకు,ఏపిలో కేజి రొయ్యలకు రూ. 50/-లు రేటు వ్యత్యాసం ఉంటుంది.ప్రస్తుతం 100 కౌంట్ రొయ్యలు కేజి రూ. 240/-లు తమిళనాడులో ఉంటే ఇక్కడ రూ.210/- ధర ప్రకటించి ప్రాసెస్ యూనిట్ల యాజమాన్యం సాగుదారుల పొట్ట కొడుతున్నారన్నారు.ఇవికాక రొయ్యలకు పలు రకాల వ్యాధులు సోకడం వలన సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటితోపాటుగా సీడ్,మేత, మందులు, కెమికల్స్ ధరలు పెరుగుదల, కరెంట్ చార్జీలు మోత, మానవ వనరుల కొరత వంటి సమస్యలు పట్టిపీడిస్తున్నాయి.ఇప్పటికైన ప్రభుత్వం కళ్ళుతెరిసి ఆక్వా సాగుదారులకు బహిరంగ మార్కెట్లో రేటు లేకుండా సిండికేట్ వ్యాపారం చేస్తున్న ఆక్వా ప్రాసెస్ యూనిట్లు/వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకుని ధరలు స్థిరీకరించాలి. అంతేకాక ప్రభుత్వమే ప్రత్యక్షంగా రొయ్యల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సీడ్, ఫీడ్ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజ్లు ఏర్పాటు చేయాలి. రొయ్య / చేప మేత, ఆక్వా కెమికల్స్, మందుల ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సొసైటి వలే ప్రభుత్వ రంగంలో ప్రాథమిక ఆక్వా ఉత్పత్తి, అమ్మకం, కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయాలన్నారు.ఆక్వా ప్రాసెస్ కంపెనీల యాజమానులపై కఠిన చర్యలు తీసుకుని రొయ్య సాగుదారులకు న్యాయం చేయాలనీ, లేని పక్షంలో రాష్ట్రంలో ఉన్న రొయ్య/ఆక్వా సాగుదారులతో పెద్ద ఎత్తున ఆందోళన చేడతామని హెచ్చరించారు.

ఇందిరమ్మ అభయహస్తం కింద్ర నెల 5వేలు : దత్తాత్రేయులు

విశాలాంధ్ర-గుడివాడ : కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద కుటుంబాలకు నెలకు ఇందిరమ్మ అభయహస్తం ద్వార 5వేల రూపాయిలు మీ ఎక్కౌంట్‌లోకి రావడం జరుగుతుందని గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి శిష్టా దత్తాత్రేయులు అన్నారు. శనివారం స్థానిక 7వ వార్డులోని కొత్తపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్లరేషన్ కార్డు గల మహిళలచే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఇంద్రమ్మ అభయ హస్తంలో వారి ఓటర్ ఐడి కార్డును నమోదును ప్రారంభించారు.ఈ సందర్భంగా దత్తాత్రేయులు జిల్లా ఉపాధ్యక్షుడు వద్దాది రాజేష్, తుమ్మల కాళీ, మహమ్మద్ అలీ, కసిరెడ్డి సత్యవతి, వద్దాది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-పెడన: అమరజీవి పొట్టి శ్రీరాములు 123వపుర స్కరించుకుని పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్ధన మందిరం నందు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు కొల్లిపర శ్రీనివాసరావు ఏర్పాటుచేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త ఫణిభూషణరావు ప్రారంభించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాలు కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ, శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధినాథ సాయి మాట్లాడుతూ ఆర్యవైశ్యులతో పాటు ప్రజలందరూ గర్వించదగ్గ నేతలు గాంధీ, శ్రీరాములని అన్నారు. పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త ఫణిభూషణరావు మాట్లాడుతూ భారతదేశ ప్రజల స్వేచ్ఛ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు ఆశయాలు నేటితరం అందరికీ ఆదర్శం కావాలన్నారు. ఈ సందర్భంగా గాంధీ, శ్రీరాములు విగ్రహాల దాత కొల్లిపర శ్రీనివాసరావును కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి సేవాదళ్, వాసవి క్లబ్ తదితర స్వచ్ఛంద సేవ సంస్థ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారులు ఇమ్మడి నాగపోతరావు కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరు సురేష్ కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా ఉపాధ్యక్షులు చిట్టూరి పశుపతినాథ్ బాబు, జల్లూరి రాంబాబు ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ కార్యదర్శి సమయమంత్రి కుమార్ కార్యవర్గ సభ్యులు వేముల రమేష్, ఐవి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర-కంచికచర్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 123 వ జయంతి కార్య క్రమాన్ని కంచికచర్ల శాఖా గ్రంథాలయం నందు ఈరోజు ఉదయం ఘనంగా నిర్వ హించినాము.గ్రేడ్ 2 గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.రిటైర్డ్ లైబ్రేరియన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు,గ్రంథాలయ పాఠకులు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పుష్పాలు అర్పించి నివాళులర్పించారు.పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం చేసిన సేవలు గురించి గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ పొట్టి శ్రీరాముల ఒక భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు మరియు మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు.అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రుల ఆశయ సాధన కోసం ఆయన చేసిన త్యాగానికి ఆంధ్ర ప్రాంతంలో శ్రీరాములు("అమరజీవి") గా గౌరవించ బడ్డారు.మద్రాసు రాజధానిగా వుండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించాడు.చాలా మామూలుగా ప్రారంభమైన దీక్ష, క్రమంగా ప్రజల్లో అలజడి రేపింది.ప్రభుత్వం మాత్రం రాష్ట్రం ఏర్పాటు దిశగా విస్పష్ట ప్రకటన చెయ్యలేదు.56 రోజుల పాటు నిరాహార దీక్ష చేయడం ద్వారా అతను ప్రసిద్ధి చెందాడు. అతను ప్రక్రియలో మరణించాడు. అతని మరణం ప్రజా అల్లర్లకు దారితీసింది. శ్రీరాములు మరణించిన మూడు రోజుల తరువాత కొత్తగా విముక్తి పొందిన దేశం ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యాన్ని భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ డిసెంబర్ 19 న ప్రకటించారు. అని గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు తెలియజేసారు.

పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: తెలుగు ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఆయన త్యాగం మనందరికీ స్ఫూర్తిదాయకం అని గుడ్లవల్లేరు పంచాయితీ కార్యదర్శి ఎ.జే.ఎల్.నరసింహారావు అన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తెలుగు ప్రజలు ఒక రాష్ట్రంగా ఉండాలని ఆంధ్ర రాష్ట్ర సాధనకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గుడ్లవల్లేరు పంచాయితీ కార్యాలయంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిన్నతనం నుండే గాంధీజీ ఆశయాలను పుణికిపుచ్చుకుని దేశభక్తి ఉద్యమాలలో పాల్గొన్నారని అన్నారు. శ్రీరాములు లాంటి పది మంది సహచరులు నాకు లభిస్తే ఒక్క సంవత్సరంలోనే బ్రిటీషు వారి నుండి భారతదేశానికి విముక్తి కల్గించగలనని గాంధీజీ అన్నారంటే పొట్టి శ్రీరాములు ఎంతటి ఉద్యమశీలి అనేది అర్థమవుతుందని అలాంటి వారి త్యాగాని స్ఫూర్తిగా తీసుకుని భావితరాలు ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు వితరణ

విశాలాంధ్ర-మైలవరం : పట్టణంలోని ఫిట్ జోన్ జిమ్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు 25మందికి బత్తుల శ్రీకాంత్ టీ షర్టులను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని, శరీర రుగ్మతలు వైదొలుగుతాయని అన్నారు. యువత సెల్ ఫోన్లకు దూరంగా ఉండి రోజుకు కనీసం ఒక గంట పాటైన వ్యాయామం చేయాలని సూచించారు, పట్టణాల్లో ఉండే అత్యాధునిక పరికరాలతో గ్రామీణ ప్రాంతమైన మైలవరంలో ఫిట్ జోన్ జిమ్మ్ నిర్వహించండం సంతోషదాయకమని ఆయన అన్నారు, మహిళలు, యువకులు ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని మరింత మెరుగు పరుచుకోవాలని శ్రీకాంత్ కోరారు. ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రొత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్ జోన్ జిమ్మ్ కోచ్ బుడిపూటి వెంకట్రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో జమ్మి చెట్టు సెంటర్ వద్ద గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవి క్లబ్ ఆనందవనం, వాసవి క్లబ్ నందనవనం, వాసవి కపుల్స్ క్లబ్ సభ్యులతో కలిసి టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి అయిన మహా పురుషుడు. ఆంధ్రులకు ప్రా%శీ%త. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనాడని కొనియాడారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని అన్నారు.తెలుగువారి అస్తిత్వం కోసం ఆత్మగౌరవ చరితకు నాందిగా ప్రాణ త్యాగం చేసిన అమరుడు పొట్టి శ్రీరాములని అన్నారు.నాటికి నేటికి తెలుగువారి పోరాటాలకు ఆ త్యాగధనుడే స్ఫూర్తి అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ వాసవి క్లబ్బుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రులకు ప్రాతఃస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : భాషా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి ఆమరణ దీక్షబూని అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రతి తెలుగు వారి గుండె గుడిలో పూజింపబడే ప్రాతఃస్మరణీయుడని, చారిత్రక పురుషుడని సాంఘిక సామాజిక సేవకులు, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్యగుప్త అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవి భవన్ లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలదండలు వేసి జోహార్లు పలికి విద్యార్థినులకు నోట్స్ పుస్తకాలు, బిస్కెట్లు, స్వీట్స్, పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ అడుగుజాడలలో నడిచిన గాంధీయవాది పొట్టి శ్రీరాములని హరిజనులకు ఆలయ ప్రవేశం కలిగించి సామాజిక స్పృహ ప్రబలం చేసిన తాత్వికవేత్త, సంఘసంస్కర్త, ఆదర్శనీయుడని అన్నారు. ప్రతి తెలుగువాడు అటువంటి వారి ఆశయాలను ప్రేరణగా తీసుకుని సత్సంకల్పంతో సేవలందిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ప్రాణాలను లెక్క చేయక చరిత్రను సృష్టించిన ఖ్యాతి పొట్టి శ్రీరాములదన్నారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్, పూర్వ గవర్నర్ రామచంద్రరావు, వాసవి నాయకుడు రామచంద్రరావు, వివిధ వాసవి క్లబ్బుల సభ్యులు పాల్గొని పొట్టి శ్రీరాములకు ఘన నివాళులర్పించారు.

సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల: మండలంలోని పెండ్యాల గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.18 లక్షల అంచనా వ్యయంతో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనుల ను స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పాలనలో అందుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉంది ప్రతి గడపకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయి.సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమ ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు చేస్తున్నాం. గ్రామాల్లో పెద్ద ఎత్తున రోడ్లు - డ్రైనేజీల నిర్మాణాల పై దృష్టిపెట్టామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల ఆవేదనాగళమే రేపు జరగబోయే ఈ ప్రజాగళం

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల జనసే పార్టీ కార్యాలయంలో శనివారం నాడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చాపలమడుగు కాంతారావు మాట్లాడుతూ ఆదివారం జరగబోయే ప్రజాగళం సభకు జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, మండల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ ప్రజాగళం బహిరంగసభ చరిత్రలో నిలిచిపోతుందని, అన్ని వర్గాల్లో గూడుకట్టుకున్న ప్రజా వ్యతిరేకతను ఈ సభ ద్వారా తెలియజేస్తామన్నారు. మరోసారి రాష్ట్ర భవిష్యత్ కోసం పునరావృతమై ఖచ్చితంగా భారీ విజయాన్ని సాధించబోతున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు తోట క్రాంతిబాబు, కె. మణికంఠ, కె. రామకృష్ణ, జి. సుధీర్, పి. రమేష్, బీజేపీ నాయకులు, బలగాని గోపి మరియు జనసైనికులు పాల్గొన్నారు.

కొనసాగిన అన్నసంతర్పణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసైనికుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం 36 వ వారం కొనసాగింది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అవనిగడ్డ, కోడూరు రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 36వ శనివారం రామిశెట్టి సాయిచైతన్య- సౌజన్య ఎన్ఆర్ఐ దంపతులు ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో 225 మందికి పైగా నిరుపేదలకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి సభ్యులు బొప్పన బాను, జనసైనికులు తోట ఆంజనేయులు, గుడివాక రామాంజనేయులు, తుంగల నరేష్, పప్పుశెట్టి శ్రీను, రోహిత్ పాల్గోన్నారు.